Follow:
pallavinews.com

అక్షర పల్లవి

24.08.2025 ఆదివారం, హైదరాబాద్ www.pallavinews.com




అధికారిక లాంఛనాలతో సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు

02



బ్యాట్ చోరీకి వెళ్లి సహస్రను చంపేశాడు

02



గ్రేటర్‌లో 2 లక్షల మట్టి గణపతుల పంపిణీ

02





# మా పైసలు మాకివ్వండి

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వరా?

- డీఏలు, పీఆర్సీ ఇంకెప్పుడు?
- పెండింగ్ బకాయిలు ఏప్పుడొస్తయ్
- 317 జీవో రద్దు మాటేమైంది?
- సీఎం రేవంత్ రెడ్డికి టీచర్ల ప్రశ్న.. యూఎస్ పీసీ ఆధ్వర్యంలో నిరసన
- జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ఉపాధ్యాయ లోకం

పల్లవి, హైదరాబాద్:

మేము దాచుకున్న డబ్బులు మాకు ఇవ్వడానికి సర్కారుకొచ్చిన ఇబ్బందేమిటి? రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వరా? డీఏలు, పీఆర్సీ ఇంకెప్పుడు? పెండింగ్ బకాయిలు ఏప్పుడొస్తయ్? 317 జీవో రద్దు మాటేమైంది? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని టీచర్లు ప్రశ్నించారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్ పీసీ) ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో చేపట్టిన ధర్నాకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకొని నినదించారు. దాదాపు 18 ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాకు ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎమ్మెల్సీ కోదండరాం సహా ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో ప్రశాంతంగా కొనసాగాలంటే.. టీచర్లు ప్రశాంతంగా బడిలో పాఠాలు చెప్పుకునే పరిస్థితి ఉండాలని అన్నారు. టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే.. జరిగే నష్టం ప్రభుత్వానికి తెలియనిది కాదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తన వంతుగా ప్రభుత్వానికి టీచర్ల డిమాండ్లను తీసుకువెళ్తానని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇచ్చిన అవకాశం ముగిసిందని, హక్కుల కోసం, సమస్యల సాధన కోసం పోరాటం ఒక్కటే మార్గమన్నారు. సెప్టెంబర్ 1 నుంచి దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూఎస్ పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, వెంకట్, సోమయ్య, కొమ్ము రమేశ్, అనిల్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# మద్యం సీసాతో ఆందోళన

- లిక్కర్ అమ్మకాలపై ఉన్న సోయి.. యూరియా ఇవ్వడంలో ఏది?
- సర్కారును ప్రశ్నించిన అన్నదాతలు
- సిద్దిపేట జిల్లాలో వినూత్న రీతిలో నిరసన

పల్లవి, సిద్దిపేట:

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ఆల్వాల గ్రామంలో యూరియా అందక.. మద్యం సీసాలతో రైతులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి లిక్కర్ అమ్మకాలపై ఉన్న సోయి... రైతులకు యూరియా అందించడంలో లేకపోయే అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. చెప్యాల ఎక్స్ రోడ్ వద్ద ఉన్న ఆగ్రోస్ రైతు సేవ కేంద్రానికి యూరియా వస్తుందని తెలిసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శనివారం క్యూ లైన్ లో నిలబడ్డారు. అయినా కూడా ఒక్క బస్తా యూరియా కూడా దొరకక ఆందోళన చేపట్టారు. దింతో మిరుదొడ్డి ఎస్సై సమతా ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ మధ్య యూరియా పంపిణీ చేసారు. అయితే ఇక్కడే ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. క్యూ లైన్ లో పెట్టిన జిరాక్స్ పాస్ పుస్తకాలపై ఖాళీ మందు సీసాలు పెట్టి నిరసన తెలిపారు రైతులు. ఇక్కడికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు.

# మూసీ డెవలప్‌మెంట్‌కు రూ.375 కోట్లు రిలీజ్

- నిధులు విడుదల చేసిన సర్కారు
- బడ్జెట్ కేటాయింపుల మేరకు విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పల్లవి, హైదరాబాద్:



మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.375 కోట్లు విడుదల చేశారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల నుంచి వీటిని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో మూసీ నదికి పునరుజ్జీవం కల్పించనున్నారు. స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయనున్నారు. పర్యాటకంగాను ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే.

# హైడ్రాకు వందేళ్ల ప్రణాళిక

- హైడ్రా.. ఒకటి రెండేళ్లకు పరిమితం కాదు
- స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్
- హైడ్రా రాజకీయ ఉద్దేశంతో పనిచేయడం లేదని స్పష్టం

పల్లవి, హైదరాబాద్:



హైడ్రాపై ప్రజలకు మరింత క్లారిటీ రావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "హైడ్రా.. ఒకటి రెండేళ్లకు పరిమితం కాదు. వందేళ్ల ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. ప్రస్తుతం ఆరు చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. సీఎస్ఆర్ పేరుతో కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. సాంకేతిక ఆధారాలతో ఎఫ్‌టీఎల్ మార్కు చేస్తున్నాం. చెరువుల వద్ద భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. వీటితో పాటు నాలాలను నోటిపై చేస్తున్నాం. రాజకీయ ఉద్దేశంతో హైడ్రా పని చేయడం లేదు. విపత్తుల నుంచి నగర ప్రజలను రక్షించేందుకు, ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్ఆర్ వరకు ఉన్న చెరువులకు సంబంధించి ఈ ఏడాది పూర్తిస్థాయిలో తుది నోటిఫికేషన్‌పై దృష్టి సారించాం. అనేక అవరోధాలు, విమర్శలను ఎదుర్కొంటూ హైడ్రా ఏడాది కాలంగా ముందుకు సాగుతోంది. ప్రజల్లో హైడ్రా పట్ల నమ్మకం పెరిగిందనడానికి కూకట్‌పల్లి నల్ల చెరువు నిదర్శనం" అని రంగనాథ్ తెలిపారు.




# ఓట్ చోరీపై గళమెత్తండి

- లోగో ఆవిష్కరించిన సీఎం రేవంత్
- ఇక 'వోట్ చోరీ'పై ప్రజల్లోకి వెళ్లనున్న కాంగ్రెస్

2

# కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి

## బీజేపీలో చేరాలంటే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి రావాలి

- రాష్ట్రానికి రావాల్సిన యూరియా తప్పకుండా పంపిస్తాం
- మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో మాకు సంబంధం లేదు
- ఫిరాయింపులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే
- మీడియా చిట్ చాట్ లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాట్ కామెంట్స్

పల్లవి, హైదరాబాద్:



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూస్తామని ఆయన అన్నారు. శనివారం ఆయన మీడియా చిట్ చాట్ లో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో దాదాపు 4 లక్షల డబుల్ ఓట్లు ఉన్నాయని, రాష్ట్రంలో ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తాము ఓట్ల చోరీకి పాల్పడితే లోక్‌సభలో తమ పార్టీ సీట్లు ఎందుకు తగ్గాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి యూరియా సరఫరా అంశంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనతో ఫోన్‌లో మాట్లాడారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కావాలని కోరారని, రాష్ట్రానికి రావాల్సిన వాటాను తప్పకుండా పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సాంకేతిక కారణాల వల్ల రామగుండం ఫ్యాక్టరీలో యూరియా ఉత్పత్తి నిలిచిపోయిందని ఆయన వివరించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పందిస్తూ,

• మిగతా 2లో..

GENERAL

ఆదివారం
24.08.2025
హైదరాబాద్

అక్షర
పల్లవి
www.pallavinews.com

2

follow: pallavinews





# వాటర్ బోర్డులో ఏఐ టెక్నాలజీ

హమారా హైదరాబాద్:

తాగునీటి సప్లయ్, మురుగు నీటి నిర్వహణ,లేటెస్ట్ టెక్నాలజీ వాడకంలో దేశంలోనే వాటర్ బోర్డు ముందుందని సంస్థ ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. కస్టమర్ల ఫిర్యాదులను తొందరగా పరిష్కరించడానికి ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను వాడుతున్నట్లు ఆయన చెప్పారు. గతేడాది అత్యధికంగా ట్యాంకర్లను బుక్ చేసిన ప్రగతినగర్ లోని అపార్ట్ మెంట్ ను ఏఐ టెక్నాలజీతో గుర్తించినట్లు ఆయన తెలిపారు. శనివారం ఆ అపార్ట్ మెంట్ ను వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అపార్ట్ మెంట్ వాసులతో, స్థానికులతో మాట్లాడారు. ఏడాది కాలంలో మెట్రో కస్టమర్ కేర్(ఎంసీసీ)లో నమోదు అయిన ఫిర్యాదులను,ట్యాంకర్ బుకింగ్ వివరాలను ఏఐ ద్వారా కొన్ని రోజులుగా ఐటీ డిపార్ట్ మెంట్ అధికారులు విశ్లేషిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విశ్లేషణలో ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయో, ఏయే ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు, తరుచూ నమోదవుతున్న ఫిర్యాదులను విశ్లేషిస్తున్నట్లు ఎండీ అశోక్ రెడ్డి చెప్పారు.

**6 లక్షల 59 వేల ఫిర్యాదులు..**

గతేడాది సెప్టెంబర్ 1 నుంచి ఇప్పటివరకు 6 లక్షల 50 వేలకు పైగా వివిధ సమస్యలపై వాటర్ బోర్డు కస్టమర్ కేర్ కు అందాయని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. 12 లక్షలపైగా వాటర్ ట్యాంకర్లను వినియోగదారులు బుక్ చేసుకున్నారన్నారు .ఈ ప్రాంతంలో గత వేసవిలో అత్యధిక ట్యాంకర్ బుకింగ్స్ నమోదు అయినట్లు ఏఐ టెక్నాలజీ ద్వారా గుర్తించామన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని కీలక ప్రాంతాలపై స్పెషల్ ఫోకస్ పెట్టామన్నారు. అత్యధికంగా ట్యాంకర్ బుక్ చేసిన టాప్ 10 కస్టమర్లను ఏఐ సాయంతో గుర్తించామన్నారు. ప్రగతినగర్ లోని ఓ రెసిడెన్సీ అపార్ట్ మెంట్ ఏడాది కాలంలో 674 ట్యాంకర్లను బుక్ చేసినట్లు తేల్చామన్నారు.

**సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటన..**

ప్రగతినగర్ లోని అపార్ట్ మెంట్ తో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి.. అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ ప్రాంతాల్లో గతంలో మున్సిపాలిటీలో ఉన్నప్పుడు 15 రోజులకోసారి నీటి సరఫరా ఉండేదన్నారు. తర్వాత వాటర్ బోర్డు చొరవతో పైపు లైన్లు మంజూరు చేయడంతో.. వారానికి ఒకసారి మంచి నీరు సరఫరా జరిగిందని స్థానికులు ఎండీకి చెప్పారు. అలాగే రెండు నెలల రెండ్రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా అవుతోందన్నారు. డే బై డే నీటి సప్లయ్ అందించాలని స్థానికులు వాటర్ బోర్డు ఎండీని కోరారు. డే బై డే నీటి సరఫరాపై చేపట్టాల్సిన పనులపై అధికారులతో ఎండీ అశోక్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ప్రగతినగర్ సంపునకు ప్రత్యేక ఫీడర్ మెయిన్ డెవలప్ చేస్తే ఈ సమస్య తీరిపోతుందన్నారు. ఇందుకు రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ఎండీకి వివరించారు. దానికి ప్రతిపాదనలను పరిశీలించిన ఎండీ అశోక్ రెడ్డి.. వెంటనే పనులు చేపట్టాలనన్నారు.

**ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకోవాలి...**

ఏడాది కాలంలో అత్యధిక ట్యాంకర్లను బుక్ చేసుకున్న ప్రగతినగర్ లోని రెసిడెన్సీని సందర్శించిన వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి.. కీలక సూచనలు చేశారు. ఆ ఏరియాలో భూగర్భజలాలు లేకపోవడంతో అపార్ట్ మెంట్ వాసులు తాగునీటి కోసం వాటర్ బోర్డుపై ఆధారపడుతున్నట్లు ఆయన గుర్తించారు. వందకుపైగా ఇళ్లు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతలు లేకపోవడంతో వేసవిలో ట్యాంకర్ల మీద ఆధారపడుతున్నట్లు ఆయన తెలుసుకున్నారు. అపార్ట్ మెంట్ ఆవరణలో పాడైపోయిన బోర్ వెల్ ను గుర్తించిన అశోక్ రెడ్డి.. దాన్ని వెంటనే బాగు చేసుకొని వాడుకోవాలని అపార్ట్ మెంట్ వాసులకు సూచించారు. విశాలమైన అపార్ట్ మెంట్ లో కొన్ని ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దీనివల్ల సమ్మర్ లో ట్యాంకర్లు బుక్ చేసుకునే అవసరం ఉండదన్నారు. ఇందుకు అవసరమైన ఏఐ టెక్నాలజీ సాయాన్ని వాటర్ బోర్డు స్థానిక అధికారులు అందజేస్తారని అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట సీజీఎం ఆనంద్ నాయక్, జీఎం సుబ్బారాయుడు, డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ పాల్గొన్నారు.

## ఓట్ చోరీపై గళమెత్తండి

- **లోగో ఆవిష్కరించిన సీఎం రేవంత్**
- **ఇక 'వోట్ చోరీ'పై ప్రజల్లోకి వెళ్లనున్న కాంగ్రెస్**

**పల్లవి, హైదరాబాద్:** హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో శనివారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన పీఏసీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోసహా కాంగ్రెస్ అడ్వైజరీ కమిటీ, మంత్రులు పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎమ్మెల్యేల అనర్హత అంశం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వంటి పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బీజేపీ, ఈసీల 'వోట్ చోరీ' అంశంపై ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. ఇకపై 'వోట్ చోరీ' అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ మేరకు నేటి సభలో 'వోట్ చోరీ' ప్రచార లోగోను సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ తదితరులు ఆవిష్కరించారు. 'వోట్ చోరీ' అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## గ్రేటర్‌లో 2 లక్షల మట్టి గణపతుల పంపిణీ

- **వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు**
- **పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలి**
- **పిలుపునిచ్చిన మేయర్ గద్వాల విజయలక్ష్మి**

*హమారా హైదరాబాద్: గ్రేటర్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ప్రజలంతా పర్యావరణ హితంగా పండుగ చేసుకోవాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ తరపున 2 లక్షల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. శనివారం జీహెచ్ఎంసీ హెడ్డాఫీసులో కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి ఉద్యోగులు, సిబ్బందికి జీహెచ్ఎంసీ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గణేశ్ పండుగ కోసం 25 వేల మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శానిటేషన్, స్ట్రీట్ లైట్లు, చెట్ల తొలగింపు, రోడ్ల రిపేర్లు, నిమజ్జనం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.*

# బ్యాట్ చోరీకి వెళ్లి సహస్రను చంపేశాడు

- **దొంగతనం కోసం నెలరోజుల ముందే ప్లాన్**
- **ఇంటి పక్కన ఉండే 14 ఏళ్ల బాలుడే ఇదంతా చేశాడు**
- **కూకట్ పల్లిలో బాలిక హత్య కేసు వివరాలను వెల్లడించిన సీపీ మహంతి**



హమారా హైదరాబాద్:


కూకట్‌పల్లి బాలిక సహస్ర హత్య కేసులో కీలక విషయాలను పోలీసులు వెల్లడించారు. బాలుడే హత్య చేశాడని అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. దొంగతనం కోసం నెల రోజుల ముందే ప్లాన్ చేసినట్టు చెప్పుకొచ్చారు. బాలిక హత్యకు వాడిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నట్టు స్పష్టం చేశారు. బ్యాట్ కోసం ఇదంతా జరిగినట్టు తేలిందన్నారు. కూకట్‌పల్లి సహస్ర హత్య కేసుకు సంబంధించి శనివారం సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ మహంతి మాట్లాడుతూ.. 'ఈనెల 18న బాలిక హత్య జరిగింది. మూడు రోజుల వరకు సరైన క్లూ దొరకలేదు. శుక్రవారం బాలుడిని పట్టుకున్నాం. పక్కింట్లో ఉన్న 14 ఏళ్ల బాలుడే సహస్రను హత్య చేశాడు. క్రికెట్ బ్యాట్ దొంగలించేందుకే సహస్ర ఇంటికి బాలుడు వెళ్లాడు. బ్యాట్ తీసుకుని వెళ్తుంటే సహస్ర చూసింది. వెంటనే దొంగ దొంగ అని అరిచింది. దీంతో, సహస్రను బెడ్‌రూంలోకి తోసి ఆమెపై కత్తితో దాడి చేశారు. బాలికను తోసేసి కళ్లు మూసుకుని కత్తితో పొడిచాడు. ఇంట్లో ఎవరూ లేరు అనుకుని దొంగతనానికి వెళ్లాడు.. కానీ, బాలిక ఉండేసరికి ఆమెపై దాడి చేశాడు. ఈ కేసులో బాలుడిని ప్రశ్నిస్తే విచారణను తప్పుదారి పట్టించే సమాధానాలు చెప్పాడు. బాలిక హత్యకు వాడిన కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నాం. బాలుడే హత్య చేశాడని అన్ని ఆధారాలు ఉన్నాయి. దొంగతనానికి సంబంధించి ప్లాన్ మొత్తం ఓ నోట్‌లో రాసుకున్నాడు. దొంగతనం కోసం నెల రోజుల ముందే ప్లాన్ చేశాడు. బ్యాట్ కోసం సహస్ర తమ్ముడితో ఒకసారి గొడవ పడ్డాడు. నిందితుడికి క్రైమ్ సీన్స్ చూసే అలవాటు ఉంది. ఆ సినిమాల ద్వారా ఎలా తప్పించుకోవాలో తెలుసుకున్నాడు. ఓటీటీలో క్రైమ్ సినిమాలు, సీన్స్ చూసి ప్రభావితం అయ్యాడు. ఈ ఘటనలో తల్లికి అనుమానం వస్తే ఆమెపై ప్రామిస్ చేసి బాలుడు నమ్మించాడు. బాలుడే హత్య చేశాడని అన్ని ఆధారాలు దొరికాయి. కత్తిని బాలిక ఇంట్లోనే కడిగేశాడు. రక్తపు మరకులు ఉన్న బట్టలను వాషింగ్ మెషీన్‌లో వేశాడు. చాలా సంక్లిష్టమైన కేసు ఇది. విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. నిందితుడిని జువైనల్ హోంకు తరలించాం. నిందితుడి కోసం ఐదు బృందాలు గాలించాయి' అని సీపీ అవినాశ్ మహంతి తెలిపారు.

## కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి

( మొదటిపేజీ తరువాయి )

ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ దొందూ దొందేనని విమర్శించారు. బీజేపీలోకి ఎవరైనా రావాలనుకుంటే, తమ పదవులకు రాజీనామా చేసి రావాలని ఆయన స్పష్టం చేశారు. మొయినాబాద్ ఫాం హౌస్ కేసుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మరోసారి తేల్చి చెప్పారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై మాట్లాడుతూ.. మెట్రో ప్రస్తుతం నష్టాల్లో నడుస్తోందని, దీంతో కొత్త లైన్ల నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థ సుముఖంగా లేదని అన్నారు. అయితే, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. బీహార్‌లో బీజేపీ తప్పకుండా అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.





# అధికారిక లాంచనాలతో సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు

- **ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి**
- **నేడు మఖ్దూం భవన్ లో సందర్శనార్థం సురవరం భౌతిక కాయం**
- **మధ్యాహ్నం 3 గంటలకు గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర**
- **భౌతిక కాయాన్ని కాలేజీకి అప్పగించనున్న కుటుంబ సభ్యులు**

హమారా హైదరాబాద్:

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరపాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వెంటనే ఈ ఆదేశాలను అమలు చేయాలని దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి(83) గచ్చిబౌలి కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం సురవరం భౌతికకాయానికి అధికారిక లాంఛనాలతో గౌరవ సూచకంగా అధికారులు నివాళులు అర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయయుడు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్ నుంచి మఖ్దూం భవన్‌కు తరలించనున్నట్లు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. ప్రముఖులు, వివిధ పార్టీల నేతలు, ప్రజల సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మఖ్దూం భవన్‌లో భౌతికకాయాన్ని ఉంచనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు అంతిమ యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్యవిద్యార్థుల పరిశోధన కోసం సాయంత్రం 5 గంటలకు సురవరం పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.